క్లుప్తంగా

ల్యాండ్ కన్వర్షన్ ద్వారా రూ.45 లక్షల ఫీజు వసూలు

● ఆర్డీఓ చంద్రశేఖర నాయుడు



ఆర్డీఓ చంద్రశేఖర నాయుడు

చీరాల టౌన్: చీరాల రెవెన్యూ డివిజన్ పరిధిలోని పది మండలాల్లో ల్యాండ్ కన్వర్షన్ ద్వారా ప్రభుత్వానికి రూ.45 లక్షల ఫీజు వసూలు చేశామని ఆర్డీఓ తూమాటి చంద్రశేఖర నాయుడు తెలిపారు. డివిజన్ పరిధిలోని పది మండలాల్లో 2024 మార్చి నుంచి 2025 జనవరి 25 తేదీ వరకు వేసిన లే అవుట్లు నుంచి ఓటీసీ పన్నులు వసూళ్లు చేశామని తెలిపారు. చీరాల రెవెన్యూ డివిజన్ పరిధిలోని అద్దంకి మండలంలో రూ.8,47,513, బల్లికురవ మండలంలో రూ.5,88,245, చీరాల మండలంలో రూ.2,97,125, ఒంకొల్లు రూ.27,850, జె పంగులూరు మండలంలో రూ.1,50,320, కారంచేడు మండలంలో రూ.98,400, కొరిశపాడు మండలంలో రూ.4,74,100, సంతమాగులూరు మడంలంలో రూ.1,15,085, వేటపాలెం మండలంలో అత్యధికంగా రూ.18,95,740 ల్యాండ్ కన్వర్షన్ ఫీజు చలానాలను వసూలు చేసి ప్రభుత్వ ఖాతాకు జమ చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ వెంచర్లు వేసే ప్రతి ఒక్కరూ నియమ నిబంధనలు పాటించి ప్రభుత్వానికి పన్నులు చెల్లించాలన్నారు. భూ బదలాయింపు ప్రక్రియ, అనుమతులు పొందిన తర్వాతే ప్రజలకు ప్లాట్లు అమ్మకాలు చేయాలని, అనుమతులు లేని ప్లాట్లు కొనడం వల్ల కొనుగోలుదారులు నష్టపోతారన్నారు. చీరాల రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్నీ మండలాల్లో ల్యాండ్ కన్వర్షన్‌ను సక్రమంగా చేస్తున్నామని తెలిపారు. డివిజన్ పరిధిలోని తహసీల్దార్లంతా సమష్టిగా పనిచేయడం వల్లే ల్యాండ్ కన్వర్షన్ ఫీజులు ప్రభుత్వానికి జమ చేయించామని ఆర్డీఓ పేర్కొన్నారు.

కొండమంజులూరు విద్యార్థుల ప్రతిభ



గెలుపొందిన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం అనిత

జే.పంగులూరు: రాడికల్ హ్యూమనిస్ట్ సెంటర్ ఇంకొల్లు ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోటీల్లో కొండమంజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సీనియర్, జూనియర్ విభాగాల్లో సత్తా చాటారు. వ్యాసరచన పోటీలో కొండమంజులూరు పవన్ గోపీకృష్ణ ప్రథమ స్థానం సాధించాడు. వక్తృత్వ పోటీలో జాకబ్ జఫానియా శాస్త్రి ప్రథమ స్థానం, జాన్‌బాబు ద్వితీయ స్థానం సాధించారు. జూనియర్ విభాగంలో వ్యాసరచన పోటీలో సంజన ప్రథమస్థానం, వక్తృత్వ పోటీలో రిత్విక్ ప్రథమస్థానంలో నిలిచారు. వీరికి రాడికల్ హ్యూమనిస్ట్ ఇంకొల్లు నిర్వాహకులు మేడూరి సత్యనారాయణ 9 వ తేదిన జరిగిన రాడికల్ హ్యూమనిస్ట్ సెంటర్ వారికోత్సవ సభలో బహుమతులు అందించారు.

తిరునాళ్లను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

● డీఎస్పీ ఎస్‌డీ మొయిన్



రెండు దేవాలయాల అభివృద్ధి కమిటీలతో మాట్లాడుతున్న చీరాల డీఎస్పీ మొయిన్

చినగంజాం: శివరాత్రిని పురస్కరించుకొని మండలంలోని సోపిరాల, కొత్తపాలెం గ్రామాల్లోని శివాలయాలలో నిర్వహించే శివరాత్రి తిరునాళ్లను ప్రశాంతంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీలు సహకరించాలని చీరాల డీఎస్పీ ఎస్‌డీ మొయిన్ విజ్ఞప్తి చేశారు. శివరాత్రి తిరునాళ్లను పురస్కరించుకొని చినగంజాం పోలీస్‌స్టేషన్‌లో సోమవారం రాత్రి మండలంలోని రెండు శివాలయాల కమిటీ సభ్యులతో ఆయన శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ముందుగా ఆయన రెండు దేవాలయాల వద్దకు వెళ్లి పరిశీలించి అక్కడ తీసుకోవాల్సిన ట్రాఫిక్, భద్రతా చర్యల గురించి సమీక్షించారు. మండలంలోని కొత్తపాలెం బాలకోటేశ్వర స్వామి ఆలయం, సోపిరాల రామకోటేశ్వరాలయం పరిధిలో ఈ నెల 26న నిర్వహించే శివరాత్రి తిరునాళ్లను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని డీఎస్పీ తెలిపారు. తిరునాళ్లను పురస్కరించుకొని నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలను అసభ్యకర నృత్యాలతో కాకుండా కూచిపూడి, భరత నాట్యం, హాస్యవల్లరి వంటి సంప్రదాయ రీతిలో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణంలోనే కాకుండా ప్రధానకూడళ్లలోనూ లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. సీసీకెమెరాలు, డ్రోన్ల పర్యవేక్షణలో తిరునాళ్ల నిర్వహించుకోవడం అందరికీ మంచిదని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఆలయ ప్రాంగణంలో పర్యవేక్షించే ఆలయ కమిటీలు, ప్రదర్శనలో పాల్గొనే కళాకారులు వివరాలను పోలీస్‌శాఖకు ముందుగా అందజేయాలని సూచించారు. తిరునాళ్ల సమయంలో అందరూ దేవాలయాలు వద్ద ఉంటే ఇళ్లలో దొంగతనాలు జరిగే అవకాశం ఉన్న దృష్ట్యా విలువైన వస్తువులను లాకర్లలో భద్రపరచుకునే విధంగా ముందుగానే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆలయ కమిటీల తరపున రిటైర్డ్ మున్సిపల్ కమిషనర్ టీఎస్సార్ ఆంజనేయులు మాట్లాడుతూ శివరాత్రి పండుగ నిర్వహణలో అనాదిగా వస్తున్న సంప్రదాయలను పోలీస్ శాఖ ప్రత్యేకంగా రూల్స్‌ను ఏర్పాటు చేసి భక్తుల మనోభావలకు విఘాతం కలిగించవద్దన్నారు. గత కొన్ని దశాబ్దాలుగా నిర్వహిస్తున్న తిరునాళ్లను స్వేచ్ఛగా నిర్వహించుకునేందుకు పోలీస్ శాఖ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఇంకొల్లు సీఐ వైవీ రమణయ్య, చినగంజాం ఎస్సై శీలం రమేష్, పోలీస్ సిబ్బంది, రెండు దేవాలయాల అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులు దూరం



సంతరావూరులో మాత్రలు మింగిస్తున్న వైద్యాధికారి కీర్తి సరోజ్



మోదేపల్లిలో మాత్రలు మింగిస్తున్న వైద్యాధికారి

చినగంజాం: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరవని సంతరావూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి డాక్టర్ కె.కీర్తి సరోజ్ అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా సంతరావూరు ప్రాథమికోన్నత పాఠశాల, కడవకుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. రెండు పాఠశాలల హెచ్‌ఎం కుర్రా రామారావు, కే సత్యానందం, హెల్త్ ఎడ్యుకేటర్ యు వెంకటరమణ, ఏఎన్‌ఎంలు శారద, శిరీష, హెల్త్ అసిస్టెంట్ జి.విజయ ప్రసన్న, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అద్దంకి రూరల్: నులిపురుగుల నివారణ మాత్రలు మింగితే బాలబాలికలు ఆరోగ్యవంతులుగా ఉండవచ్చని మోదేపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీహర్ష అన్నారు. సోమవారం మోదేపల్లి పీహెచ్‌సీ పరిధిలోని చక్రాయపాలెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహించారు. మోదేపల్లి పీహెచ్‌సీ పరిధిలోని 4687 మందికి మాత్రలు మిగించారు. హెచ్‌ఎం కేవీ శ్రీనివాసరావు, ఎంఈహెచ్‌ఈఓ నాగేశ్వరరావు, సూపర్‌వైజర్ సత్తార్, ఎసీహెచ్‌పీ విజయ, ఏఎన్‌యం శివపార్వతి, ఆశా రేణుక తదితరులు పాల్గొన్నారు.

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని ప్రాసంగులపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నులిపురుగు నివారణ మాత్రలను పంపిణీ చేశారు. పీహెచ్‌సీ డాక్టర్లు కే.శశికళ, అనీష్‌లు పాల్గొన్నారు.

పర్చూరు(చినగంజాం): జాతీయ నులిపురుగులు దినోత్సవం సందర్భంగా చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు సీడీపీఓ జి.సుభద్ర తెలిపారు. పర్చూరు నెహ్రూనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఐదేళ్ల లోపు చిన్నారులకు నులిపురుగుల మాత్రలు వేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.దీపాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కారంచేడు: చిన్నారుల కడుపులో నులిపురుగులు వృద్ధి చెందడానికి అపరిశుభ్రతే కారణమని కారంచేడు, స్వర్ణ పీహెచ్‌సీల వైధాధికారులు డాక్టర్ జెస్సీరాణి, డాక్టర్ హస్మప్రియ అన్నారు. మండలంలోని స్వర్ణ, కారంచేడు పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలోను, అంగన్‌వాడీ కేంద్రాలలోని చిన్నారులందరికీ నులిపురుగుల నివారణకు అవసరమైన ఆల్‌బెండాజోల్ మాత్రలను ఉచితంగా పంపిణీ చేశారు. చిన్నారులందరికీ ఈ మాత్రలను మింగించారు. కారంచేడు పీహెచ్‌సీ పరిధిలో 1051 మందికి వేసినట్లు డాక్టర్ జెస్సీరాణి తెలిపారు. స్వర్ణ పీహెచ్‌సీ పరిధిలో 998 మందికి మాత్రలు వేసినట్లు డాక్టర్ హస్మప్రియ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ వీ నాగేశ్వరరావు, హెచ్‌ఈ మీనాకుమారి, హెచ్‌వీలు మాధురీసిఫోరా, శ్రీనివాసరావు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంకొల్లు(చినగంజాం): విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేందుకు నులిపురుగుల మాత్రలు తప్పనిసరిగా వాడాలని వైద్యాధికారి డాక్టర్ అంజలి, డాక్టర్ భానుప్రకాష్‌లు తెలియజేశారు. ఇంకొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కాలేజీలు, ఉన్నత పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలోని పిల్లలకు మాత్రలు మింగించారు. ఇంకొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని గ్రామాల్లో సోమవారం 7602 మందికి మాత్రలు మింగించారు. సీహెచ్‌ఓ బీవీ కోటేశ్వరరావు, పీహెచ్‌ఎన్ సహస్ర, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశాలు, అంగన్‌వాడీ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పర్చూరులో నులిపురుగుల మాత్రలు పంపిణీ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



స్వర్ణ ఉన్నత పాఠశాలలో మాత్రలు వేస్తున్న డాక్టర్ హస్మప్రియ, సిబ్బంది



ఇంకొల్లు: చేతులు శుభ్రం చేసుకునే విధానాన్ని విద్యార్థులకు వివరిస్తున్న వైద్యాధికారులు

తూనికలు, కొలతల్లో మోసం చేస్తే చర్యలు

● ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు



స్వర్ణలో కూరగాయల దుకాణంలో కొలతలు పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు

స్వర్ణ (కారంచేడు): తూలికలు, కొలతల్లో మోసం చేస్తే అలాంటి వ్యాపారులపై చర్యలు తప్పవని తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్ కె.నాగేశ్వరరావు హెచ్చరించారు. మండలంలోని స్వర్ణ, కుంకలమర్రు గ్రామాల్లో సోమవారం పర్యటించి చిరువ్యాపారుల వద్ద ఉండే కాటాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. కూరగాయల కొట్లతో పాటు, కిరాణా కొట్లు, పండ్ల దుకాణాలలో విక్రయాలకు ఉపయోగించే కాటాలకు తప్పనిసరిగా ముద్రలు వేయించుకోవాలన్నారు. ముద్రలు లేని కాటాలు వినియోగిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రస్తుతం ధాన్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయని, ధాన్యం కొనుగోలు చేస్తున్న వ్యాపారులు, మిల్లర్లు సైతం వినియోగించే కాటాలకు కూడా ముద్రలు వేయించుకొని ఉండాలన్నారు. కొన్ని కాటాల వద్ద ముద్రలు లేకుండా, తక్కువ తూకం చూపించేలా సెట్ చేసుకున్న వారిని గుర్తించి పై రెండు గ్రామాల పరిధిలో 8 కేసులు నమోదు చేశామన్నారు. వినియోగదారులు తూకాల్లో తేడాగా ఉందని అనిపిస్తే 8977379129 నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు.

అర్చకుడిపై దాడి హేయమైన చర్య

చీరాల అర్బన్:



మాట్లాడుతున్న అర్చక సంక్షేమ సంఘం జిల్లా నాయకులు

చిలుకూరు బాలాజీ దేవస్థానం అర్చకులు రంగరాజన్‌పై దాడి చేసిన రామరాజ్యం నాయకుడు వీరరాఘవరెడ్డి చర్యలు ఉగ్రవాదాన్ని తలపిస్తున్నాయని అర్చక సంక్షేమ సంఘం జిల్లా నాయకులు మండిపడ్డారు. చీరాలలో సోమవారం జరిగిన అర్చక సమావేశంలో అర్చక సంక్షేమ సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి వాసుదేవ సంపత్ కుమార్ ఆచార్యులు, కోశాధికారి వేదాంతం కిరణ్‌కుమార్‌లు మాట్లాడుతూ రామరాజ్యం పేరుతో ఒక దళాన్ని ఏర్పరచుకుని శ్రీరాముని పేరును అప్రతిష్ఠపాలు చేస్తున్నారన్నారు. ధార్మికవాదులు, అర్చకులు, పురోహితులుపై దాడి హేయమైన చర్య అన్నారు. రాజ్యాంగ విరుద్ధంగా చట్టాన్ని ఉల్లంఘిస్తూ న్యాయ వ్యవస్థను సైతం కించపరిచేలా ఆలయ అర్చకులు రంగరాజన్‌ని హింసించి వీడియోలు చేసి సోషల్ మీడియాలో పెట్టడం ఉగ్రవాదాన్ని తలపిస్తుందన్నారు. వీరరాఘవరెడ్డిని అదుపులోకి తీసుకున్న తెలంగాణా పోలీసులు అతని అనుచరులను కూడా అరెస్టు చేసి కఠిన శిక్షలు అమలు చేసి శాంతిభద్రతలను కాపాడాలని కోరారు.

ఘనంగా అయ్యప్ప స్వామి ఆలయ వార్షికోత్సవం



ఆలయ ప్రాంగణంలో కలశాలతో మహిళల ప్రదక్షిణ



చినగంజాం: మండలంలోని సోపిరాల హరిహర సుత అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణం వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవం పురస్కరించుకొని స్వామికి అభిషేకాలు, పడిపూజ, హోమాలు, కోలాటాలు, భక్తి పాటల కచేరి నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ టీఎస్‌ఆర్ ఆంజనేయులు దంపతుల ఆధ్వర్యంలో పూజలు చేయగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అపోహలు నమ్మొద్దు



యద్దనపూడిలో సమావేశం నిర్వహిస్తున్న విద్యాశాఖాధికారులు, ప్రజాప్రతినిధులు

యద్దనపూడి: పాఠశాలలను మూసివేస్తారనే అపోహలు వద్దని, ఏ ఒక్క పాఠశాలను మూసివేయమని ఇన్‌చార్జ్ డీఈఓ జి.వెంకటేశ్వర్లు అన్నారు. యద్దనపూడి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం మండలంలో మోడల్ స్కూల్ ఏర్పాటుపై సమస్యలను గురించి సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు మంచి విద్యను అందించడంలో తగు సిబ్బందిని సర్దుబాటు చేసేందుకు, మోడల్ స్కూల్ ఏర్పాటులో ఉన్న సమస్యలను అధిగమించేందుకు తీర్మానం చేశారు. అవకాశం ఉన్న చోట ఐదుగురు ఉపాధ్యాయులతో మొడల్ ప్రైమరీ స్కూల్ ఏర్పాటు చేయాలని, లేకుంటే ఆయా ప్రాంతాలలోని పాఠశాలలను మూసివేయకుండా బేసిక్ ప్రైమరీ స్కూల్ లేదా ఫౌండేషన్ స్కూల్స్ ఏర్పాటు చేయాలని తీర్మానించారు. కార్యక్రమంలో చీరాల ఉప విద్యాశాఖాధికారి ఏ శ్రీనివాసరావు, మండల ప్రత్యేకాధికారి ప్రకాశ్‌రావు, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, గన్నవరం, యద్దనపూడి హెచ్‌ఎంలు, మండలంలోని విద్యాకమిటీ చైర్మన్లు, మండల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చిత్రకారుల సంఘ అధ్యక్షునిగా శ్రీనివాసరావు



శ్రీనివాసరావు

చీరాల: ఉమ్మడి ప్రకాశం జిల్లా చిత్రకారుల సంఘం అధ్యక్షులుగా ఒంగోలుకు చెందిన మణి యాడ్స్ అధినేత శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఆదివారం చీరాలలోని తేజస్వి ఆర్ట్స్ పద్మారావు అధ్యక్షతన ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల్లో శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలానే ఏడుగురు సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు బి.త్యాగరాజు, లాంవర్ధనరావు, వినుకొండ అధ్యక్షులు జస్టిన్, ప్రకాశం, బాపట్ల జిల్లాలోని చిత్రకారులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రతిష్టా మహోత్సవాలు





అలంకరణలో సీతారామలక్ష్మణులు , ప్రతిష్ఠ వద్ద భక్తుల కోలాహలం

బల్లికురవ: మండలంలోని పెద అంబడిపూడిలో సీతారామాలయ ప్రతిష్ఠా మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నసంతర్పన చేపట్టారు. గ్రామానికి చెంది వివిధ ఉద్యోగాలతో స్థిరపడ్డ యువత సుమారు రూ. 60 లక్షలతో అభివృద్ధి చేయడం పట్ల గ్రామ పెద్దలు ప్రత్యేకంగా అభినందించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు సౌకర్యాలు ఏర్పాట్లు చేశారు.

ప్రసన్నాంజనేయస్వామి హుండీ ఆదాయం రూ. 27.94 లక్షలు



హుండీలోని కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో భక్తులు వేసిన కానుకల హుండీని సోమవారం దేవస్థాన ఏసీ ఎం తిమ్మానాయుడు ఆధ్వర్యంలో లెక్కించారు. హుండీ ఆదాయం రూ.7,94,895, అన్నదానానికి రూ.91,183 వచ్చినట్లు ఏసీ తెలిపారు. కార్యక్రమ పర్యవేక్షకుడిగా దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఎం వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

ఘనంగా లూర్దు మాత మహోత్సవాలు



తిరునాళ్లకు ముస్తాబవుతున్న కారంచేడు లూర్దుమాత దేవాలయం



ప్రత్యేక అలంకరణలో మేరీమాత

కారంచేడు: కారంచేడులో కొలువై ఉన్న లూర్దుమాత మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ప్రతి సంవత్సరం విజయవాడ (గుణదల) మేరీ మాత ఉత్సవాలు ఎలా జరిపిస్తారో.. అదే రీతిలో ఈ ప్రాంతంలో అంతటి ప్రాముఖ్యతను సంతరించుకున్న దేవాలయం కారంచేడు లూర్దుమాత దేవాలయం. ఏటా మేరీమాత తిరునాళ్ల మాదిరిగానే ఇక్కడ కూడా అదే తేదీల్లో తిరునాళ్ల నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ ఏడాది ఈ నెల 11న తిరునాళ్ల నిర్వహించేందుకు సంఘ పెద్దలు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికి సంబంధించి ఈ నెల 2వ తేదీ నుంచి ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు. చివరి రోజున నెల్లూరు జిల్లా సింహపురి పీఠాధిపతులు రెవరెండ్ పిల్లి ఆంథోనీదాస్ సమక్షంలో పెద్ద ఎత్తున దివ్యబలిపూజా కార్యక్రమాలు, తిరునాళ్ల నిర్వహిస్తారన్నారు.

నీటితీరువా వసూళ్లు వేగవంతం చేయండి

చీరాల టౌన్‌:

గ్రామాల్లో నీటి తీరువా వసూళ్లను నెలాఖరు కల్లా పూర్తి చేయడంతో పాటుగా ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను నిర్ణీత సమయంలోగా విచారించి పరిష్కరించాలని తహసీల్దార్‌ కుర్రా గోపీకృష్ణ అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం గ్రామ, పట్టణ రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. గ్రామాలు, సచివాలయాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న అర్జీలు, పాసు పుస్తకాలు, రెవెన్యూ అజమాయిషీ, అర్జీలపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌ మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో ఉన్న వ్యవసాయ భూములకు సంబంధించి నీటి తీరువా రూ.46 లక్షలు వసూళ్ల లక్ష్యంగా గ్రామ రెవెన్యూ అధికారులు పనులు చేయాలన్నారు. రైతుల నుంచి విధిగా నీటి తీరువాను వీఆర్వోలు సక్రమంగా వసూళ్లు చేసి నగదును బ్యాంకులో జమ చేయాలన్నారు. రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. గ్రామాల్లో, సచివాలయాల్లో పనిచేసే వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండటంతో పాటు అర్జీలను త్వరగా విచారించాలన్నారు. అక్రమంగా ఇసుకను తరలించే వారి వాహనాలు సీజ్‌ చేయాలని ఆదేశించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను సత్వరమే విచారణ చేసి ప్రజలు న్యాయం చేయాలన్నారు. వీఆర్వోలు ప్రజలకు జవాబుదారీతనంగా రెవెన్యూ ఉద్యోగులు పనిచేయాలన్నారు. విధుల్లో అలసత్వం వహించిన వారిపై శాఖా పరమైన చర్యలు తప్పవన్నారు. గ్రామాల వారీగా పెండింగ్‌లో ఉన్న పట్టాదారు పాసు పుస్తకాలను త్వరగా అందించడంతో పాటుగా గ్రామాల్లో ఎక్కడా కూడా అనధికార లే అవుట్లు వేయకుండా కట్టడి చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్‌ డి.అర్జున్‌, వీఆర్వోలు ఉన్నారు.

ఇంటిపన్ను వసూళ్లు వేగవంతం చేయండి

చీరాల టౌన్‌: గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న ఇంటిపన్నుల వసూళ్లు వేగవంతం చేయాలని ఎంపీడీఓ పి.శివసుబ్రహ్మణ్యం పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో మండలంలోని గ్రామ పంచాయతీల కార్యదర్శులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామాల్లో 2024-25 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి ఇంటి పన్నులు వసూలు చేయాలన్నారు. పన్నుల వసూళ్లలో అలసత్వం వహించరాదన్నారు. గ్రామాల్లోని ప్రజలు రోగాల బారిన పడకుండా ఉండాలంటే గ్రామాలన్నీ సుందరంగా ఉండాలని, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేసి గ్రామాలను రోగాల నుంచి కాపాడాలన్నారు. పంచాయతీల్లో రోజువారీగా పారిశుధ్య సమస్యలు లేకుండా చేయాలన్నారు. పంచాయతీల్లో పేరుకుపోయిన ఇంటిపన్నుల బకాయిలను త్వరగా వసూలు చేయాలని ఆదేశించారు. పారిశుధ్య నిర్మూలనకు చర్యలు తీసుకొని గ్రామాల్లో చెత్తకుప్పలు లేకుండా చూడాలన్నారు. గ్రామాల అభివృద్ధికి కార్యదర్శులు శ్రద్ధగా పని చేయాలన్నారు. సమావేశంలో ఈఓఆర్డీ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లు తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ నిర్వాహకుడు చందుకు నంది పురస్కారం



నంది పురస్కారం అందుకుంటున్న గుంటుపల్లి చందు

మార్టూరు: మార్టూరులో అమ్మ అనాథ ఆశ్రమం నిర్వహిస్తున్న గుంటుపల్లి చందుకు అరుదైన పురస్కారం దక్కింది. చందు సేవలను గుర్తించిన పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నిర్వాహకులు హైదరాబాద్‌ ఎన్టీఆర్‌ ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో నంది పురస్కారం అందజేసి సన్మానించారు. నంది అవార్డును హైదరాబాద్‌కు చెందిన మోర్తు సంస్థ అధ్యక్షుడు శ్రీనివాస్‌, వంశీకృష్ణచేతుల మీదుగా చందు అందుకున్నారు. చందును మార్టూరుకు చెందిన ప్రముఖులు అభినందించారు.

గర్భిణులు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

చీరాల టౌన్‌: వ్యాధి నిరోధక టీకాల ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని పీహెచ్‌సీ సీహెచ్‌ఓ రూతుమ్మ అన్నారు. ఈపూరుపాలెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని గ్రామ పంచాయతీల్లోని ఆరోగ్య ఉపకేంద్రాల్లో పనిచేస్తున్న ఆరోగ్య కార్యకర్తలు, ఏఎన్‌ఎంలతో సోమవారం ఇమ్యూనైజేషన్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీల్లోని ఆరోగ్య ఉపకేంద్రాల పరిధిలోని 5 ఏళ్ల లోపు చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు అందించాలన్నారు. గర్భిణులు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కాన్పులు ప్రభుత్వ వైద్యశాలల్లోనే జరిగేలా ఏఎన్‌ఎంలు చూడాలన్నారు. ప్రజల ఆరోగ్య స్థితిగతులపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్‌ వ్యాధులకు గురికాకుండా ప్రజలకు సూచనలు అందించాలన్నారు. సమావేశంలో ఆరోగ్య కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.